సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం । 22 । ఏప్రిల్ । 2023



ప్రభుత్వ సాయం.. వారికి వరం

ట్రాన్స్‌జెండర్స్ సమాజంలో తలెత్తుకుని గౌరవంగా జీవించడానికి ప్రభుత్వం ప్రత్యేకమైన చర్యలు చేపడుతోంది. -IIలో..



మామిడి రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం

మామిడి రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నమయ్య జిల్లా ఉద్యానశాఖ రవిచంద్రబాబు తెలిపారు. -IIలో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్ఠం	గరిష్ఠం
మొదటిరకం	రూ.74	రూ.90
రెండోరకం	రూ.50	రూ.72



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 252 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్ఠం	గరిష్ఠం
బైవోల్టిన్	528	553
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 241.64 కిలోలు

న్యూస్‌రీల్

కాల్‌సెంటర్ ఏర్పాటు

రాయచోటి అర్బన్: పట్టణంలోని ఐసీడీఎస్ జిల్లా కార్యాలయంలో ప్రత్యేకంగా కాల్‌సెంటర్‌ను ప్రారంభించినట్లు జిల్లా మహిళా,శిశుసంక్షేమ సాధికారత అధికారిణి ధనలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఎదురయ్యే సమస్యలను కాల్‌సెంటర్‌కు ఫోన్‌చేసి తెలియజే వచ్చన్నారు. కార్యాలయం పనిరోజుల్లో ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు 93913230 09కు కాల్‌చేసి జిల్లా అధికారుల దృష్టికి తమ సమస్యలను తీసుకొచ్చి పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

25లోగా ఫీజు చెల్లించాలి

కడప ఎడ్యుకేషన్: ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల కరస్పాండెంట్లు, ప్రధానోపాధ్యాయులకు 2022–23 విద్యా సంవత్సరానికి సంబంధించిన పరీక్షల ప్రశ్నాపత్రాలను పంపిణీ చేశారు. వాటికి సంబంధించిన ఫీజులను చెల్లించాలని వైఎస్సార్ జిల్లా డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. ఇంకా చెల్లించని వారు ఈనెల 25వ తేదీలోగా డీసీఈబీ కార్యాలయంలో చెల్లించి రశీదు పొందాలని పేర్కొన్నారు.

26న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశం ఈనెల 26వ తేదీన ఉదయం 9 గంటలకు జెడ్పీలో నిర్వహిస్తున్నామని సీఈఓ ఎం.సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, విద్య, వైద్య సేవలు, మహిళా సంక్షేమం, సాంఘిక సంక్షేమం, ప్రణాళిక, ఆర్థిక, పనుల స్థాయీ సంఘాల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని జిల్లా పరిషత్ సభ్యులంతా నిర్దేశిత సమయానికంటే గంట ముందు హాజరు కావాలని కోరారు. శాఖాపరమైన ప్రగతి నివేదికలతో జిల్లా అధికారులు సమావేశానికి రావాలని తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న కేంద్ర పరిశీలకులు అరుణ్ ఎన్ కదం

లక్కిరెడ్డిపల్లి: వైద్యులు ఆసుపత్రికి వచ్చే రోగులకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని కేంద్ర ఆరోగ్య పరిశీలకులు డాక్టర్ శశాంక్ శర్మ, డాక్టర్ అరుణ్ ఎస్ కదం పేర్కొన్నారు. శుక్రవారం లక్కిరెడ్డిపల్లిలోని కమ్యూనిటీ ఆసుపత్రిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఈసీజీ ల్యాబ్, ఎక్స్‌రే, కాన్పుల ఓపీ, రోగుల విశ్రాంతి గదులను పరిశీలించారు. సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయా లేదా అని ఆసుపత్రి సూపరింటెండెంట్ నీలోఫర్ బేగంను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలకు ఆపరేషన్ గది, ఆక్సిజన్ సిలిండర్ల గురించి ఆరా తీశారు. చిన్నపిల్లలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని డాక్టర్లకు సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు శ్రీనివాసరెడ్డి, ధరణి కుమార్, జీవన్ కుమార్, భరత్, సులోచన, సిబ్బంది పాల్గొన్నారు.

వరాల పండగ..ఆనందం నిండగా

- నేడు ఈద్-ఉల్-ఫితర్
- ప్రార్థనల కోసం మసీదులు, ఈద్గాలలో ఏర్పాట్లు



రాయచోటిలో ప్రత్యేక ప్రార్థనలకు ముస్తాబైన ఈద్గా



విద్యుత్ వెలుగులతో మదనపల్లెలోని జామియా మసీదు

మదనపల్లె సిటీ: ఎదురు చూసిన మధుర క్షణం వచ్చేసింది. వరాలనిచ్చే శుభాల గీతం వినిపించనుంది. షవ్వాల్ నెలవంక శుక్రవారం సాయంత్రం దర్శనం కావడంతో పవిత్ర రంజాన్‌మాసం ఉపవాసదీక్షలు ముగిశాయి. దీంతో శనివారం జిల్లా వ్యాప్తంగా సమత,మమతల కలయిక, దాన,ధర్మాలకు ప్రతీకగా నిలిచే ఈద్-ఉల్-ఫితర్ పండుగ(రంజాన్)ను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోనున్నారు. ఇందుకోసం జిల్లావ్యాప్తంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. షాబాన్ నెల 30వ రోజున రంజాన్ నెలవంక దర్శనంతో 30 రోజుల కఠోర ఉపవాసదీక్షలు ప్రారంభించడం, రంజాన్ నెల 30వ తేదీన షవ్వాల్ నెలవంక దర్శనంతో ముగించడం ఆనవాయితీగా వస్తోంది. మరుసటి రోజు చేసుకునే పండుగ ఈద్-ఉల్-ఫితర్. ముస్లిం పండుగల్లో రంజాన్ ఈద్‌కు ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ నెలలోనే దివ్య ఖురాన్ అవతరించడం, మహమ్మద్ ప్రవక్త ప్రపంచానికి తన శాంతి సందేశాన్ని పంపడం జరిగింది. ఆయన సందేశం ప్రకారమే ప్రతి ముస్లిం నడిచి దైవభక్తి, దాతృత్వ గుణాన్ని అలవర్చుకుని ముందుకెళతారు.

- ఉపవాసం సామాజిక జీవనానికి మూలం. సోదర భావం, సౌభ్రాతృత్వం, దాతృత్వమే పునాదిగా ఉపవాసదీక్ష వెల్లివిరిస్తుంది. రంజాన్‌మాసంలో ప్రతి ముస్లిం ఉపవాసాన్ని పాటిస్తారు. ఎంతటి ఐశ్వర్యవంతుడైనా,కటిక పేదవాడైనా ఉపవాసం వ్రతం ఉండి తీరాల్సిందే. ఈ దీక్షల వల్ల పేదల ఆకలి బాధను గుర్తిస్తారు. సాటి మానవుని ఆకలి బాధ, కష్టాలు తెలుసుకుని వారిని ఆదుకోవడం, వారి పట్ల దయా గుణాన్ని పెంపొందించుకోవడమే దీక్షల పరమార్థం.

ఈద్గాలో ప్రార్థనలు...

బెంగళూరు రోడ్డులోని ఈద్గా మైదానంలో ఉదయం 8.15 గంటలకు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు జరగనున్నాయి. జామియా మసీదులో 8.45ని.లకు, నిమ్రా మసీదులోని గుట్ట ఈద్గాలో 7.30గంటలకు, డ్రైవర్స్‌కాలనీలో 9గంటలకు రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు జరుగుతాయని మసీదు పెద్దలు తెలిపారు. ప్రార్థనలకు వెళ్లే ముందు సదఖా, ఫిత్రా, జకాత్‌ను చెల్లించాలని సర్ ఖాజీ హాఫీజ్ ఇక్బాల్‌సాహెబ్ తెలిపారు.

ప్రత్యేక ప్రార్థనలకు ఈద్గా ముస్తాబు

రాయచోటి : రంజాన్ పండుగ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలకు ఈద్గాలు ముస్తాబయ్యాయి. నెలరోజుల కఠోర ఉపవాసం దీక్షలు ముగిసిన సందర్భంగా శనివారం ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఇందుకోసం మున్సిపల్ అధికారులు, సిబ్బంది శుక్ర వారం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకొని తాగునీరు, ప్రాథమిక ఆరోగ్య చికిత్స కేంద్రాలను అందుబాటులో ఉంచేలా ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రాయచోటి ఈద్గా మైదానంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, కమీషనర్ గంగా ప్రసాద్‌లు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గల్ఫ్‌దేశాల్లో ఉపాధికి దరఖాస్తు చేసుకోండి

రాయచోటి అర్బన్: గల్ఫ్ దేశాల్లో హౌస్‌కీపింగ్, కుకింగ్‌కు శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ ఒక ప్రకటనలో కోరారు. 5వ తరగతి వరకు చదివి 18 నుంచి 45 సంవత్సరాల లోపు వయస్సుగల మహిళలు ఏపీ రాష్ట్రనైపుణ్యాభివృద్ధి సంస్థకు దరఖాస్తులు అందజేయా లన్నారు. రాష్ట్రంలో కొందరు మహిళలు ఉపాధి కోసం నకిలీ ఏజంట్ల మోసాల వలలో చిక్కుకుని సరైన అర్హత పత్రాలు లేకుండా విదేశాలకు వెళ్లి, అక్కడి చట్టాలు తెలియక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ప్రభుత్వం గమనించిందన్నారు. అలాంటి వారికోసం ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. ఇందులో భాగంగా ఉపాధికోసం విదేశాలకు వెళ్ళదలచు కున్న మహిళలకు అన్నమయ్య జిల్లాలోని రాయచోటి, రాజంపేట పాలిటెక్నిక్ కళాశాలల్లో కుకింగ్, హౌసింగ్ అంశాలపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. శిక్షణానంతరం వారికి గల్ఫ్‌దేశాల్లో ఉపాధి చూపించనున్నట్లు, అలా వెళ్లిన వారికి జీత,భత్యాలు,పని విషయంలో సమస్యలు వస్తే అక్కడి భారత రాయబార కార్యాలయం తగిన సహాయం అందిస్తుందన్నారు. మరి ంత సమాచారం కోసం కార్యాలయంలోని ఉద్యోగులు ప్రసాద్ –9676736623, సుజాత – 9177143181 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం

అధికారులతో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : జగనన్న లేఔట్ కాలనీలలో అన్ని శాఖలు సమన్వయంగా పనిచేసి మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ నుంచి జగనన్న హౌసింగ్ లేఔట్ కాలనీల్లో గృహనిర్మాణాల ప్రగతిపై.. హౌసింగ్, విద్యుత్, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీరాజ్, డ్వామా, ఎంపీడీఓలు, మండల ఇంజినీరింగ్ అధికారులు, మునిసిపల్ కమిషనర్లతో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గృహనిర్మాణాల పూర్తికి చేపట్టాల్సిన చర్యలపై దిశా నిర్దేశం చేశారు. పేద వారికి గూడు కల్పించాలనే సదుద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న లేఅవుట్ కాలనీలలో వంద శాతం మౌలిక వసతులు కల్పించడం అధికారుల బాధ్యత అన్నారు. హౌసింగ్ డీఈలు, ఏఈలు, మండల ఇంజినీరింగ్, విద్యుత్ శాఖ అధికారులు, ఎంపీడీఓలు శ్రద్ధ వహించి జిల్లాలో పోల్స్ నిర్ణీత లోతులో పాతారా లేదో గుర్తించి వెంటనే వాటిని సరైన లోతులో పాతించాలన్నారు. మే నెలాఖరులోగా అన్నిచోట్ల విద్యుత్ లైన్ల కనెక్షన్లు పూర్తి చేయాలన్నారు. జగనన్న ఆర్చ్ నిర్మాణాలను కూడా త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. గృహనిర్మాణ శాఖకు సంబంధించి హౌసింగ్ ఈఈ, డీఈ, ఏఈలు ముఖ్యంగా రెండు మూడు అంశాలపై దృష్టి పెట్టాలన్నారు. జిల్లాలో గ్రౌండింగ్ చేసి ఇంకనూ మ్యాపింగ్ చేయని ఇండ్లను అన్నింటినీ వారంలోపు మ్యాపింగ్ చేయించాలన్నారు. లక్ష్యసాధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. ఈ టెలీకాన్ఫరెన్స్‌లో హౌసింగ్, ఆర్‌డబ్ల్యుఎస్, విద్యుత్, పంచాయతీరాజ్, డ్వామా తదితర శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకోండి

గాలివీడు: వెలిగల్లు ప్రాజెక్టు వద్ద ఆహ్లాదకరమైన వాతావరణం ఉందని, ఇక్కడ పర్యాటకాభివృద్ధికి చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆదేశించారు. శుక్రవారం అన్నమయ్య జిల్లా గాలివీడు మండలంలోని వెలిగల్లు ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ సందర్శించారు.

ప్రాజెక్టు సామర్థ్యం, ఎంత నీరు నిల్వ ఉంది.. చెరువులకు ఎన్ని క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు, రాయచోటి మున్సిపాలిటీకి ఎంత వాటర్ విడుదల చేస్తున్నారు వంటి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రాజెక్టులో నీటి సామర్థ్యం పరిశీలించి, బోటింగ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. వెలిగల్లు ప్రాజెక్టు వద్ద టూరిజంను ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చో కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు పైభాగంలో ఉన్న కొండపై గెస్ట్ హౌస్ ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. టూరిజం శాఖ ప్రాజెక్టు వద్ద అడ్వెంచర్ స్పోర్ట్స్ వంటి అభివృద్ధి పనులు తదితర వాటిపై ఆ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

- కుషావతి నదిలో చెత్త వేయకుండా చూడాలని, చెత్తవేస్తే రూ. 10 వేలు జరిమానా విధిస్తామంటూ బోర్డు పట్టాలని పంచాయతీ కార్యదర్శి సురేష్ కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు. డంపింగ్ యార్డుకు 5 ఎకరాలు స్థలం కేటాయించాలని తహసీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు.

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎంపీ మిథున్‌రెడ్డి

మదనపల్లె : ముస్లిం మైనార్టీల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని ఎంపీ పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని టిప్పు సుల్తాన్ మైదానం ప్రహరీ నిర్మాణానికి రూ.2కోట్లు నిధులతో చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే నవాజ్‌బాషా, ఏపీఎండీసీ ఛైర్మన్ షమీంఅస్లాం, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజారెడ్డి, వైస్ చైర్మన్‌లు జింకా వెంకటాచలపతి, నూర్ ఆజంతో కలిసి శంకుస్థాపన చేశారు. స్థానిక టిప్పు సుల్తాన్ మసీదులో పవిత్ర రంజాన్ మాసంలోని చివరి శుక్రవారమైన మధ్యాహ్నం ప్రత్యేక ప్రార్థనలు ఎమ్మెల్యే నవాజ్‌బాషాతో కలిసి పాల్గొన్నారు. ముతవల్లీలు ప్రత్యేక ప్రార్థనలతో ఎంపీ, ఎమ్మెల్యేకు ఆశీర్వచనం పలికారు. అనంతరం స్థానిక నాయకులతో కలిసి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (ఏపీఎండీసీ) కార్పొరేట్ సోషియల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్‌ఆర్) నిధులతో టిప్పు సుల్తాన్ మైదానం నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నిధులను రూ.40 లక్షల చొప్పున ఐదు భాగాలుగా నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. వారం రోజుల్లోగా మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగం ద్వారా పనులు ప్రారంభిస్తామన్నారు. గత నవంబరులో విద్యాదీవెన సభలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన మేరకు టిప్పు సుల్తాన్ మసీదు నిర్మాణానికి రూ.5 కోట్లు నిధులను త్వరలోనే మంజూరు చేయిస్తానన్నారు. ముస్లిం మైనార్టీ సోదరులు ఉపవాసాలతో అల్లాను ఆరాధిస్తున్న పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం మైనార్టీల అభివృద్ధికి, దేవుని కార్యానికి నిధులు కేటాయించడం సంతోషంగా ఉందన్నారు. త్వరలోనే టిప్పు సుల్తాను మసీదు, ప్రహరీ నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. మైనార్టీల అభివృద్ధికి అవసరమైన నిధుల మంజూరు తాము కట్టుబడి ఉన్నామన్నారు. ముస్లిం సోదరులకు అభివాదం తెలుపుతూ రంజాన్ పర్వదినాన్ని సుఖసంతోషాలతో జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బి.నరేష్‌కుమార్‌రెడ్డి, బాబ్‌జాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు తట్టి శ్రీనివాసులురెడ్డి, గార్ల చంద్రమౌళి, గుండ్లూరు రఫీ, సరిత, ఇర్ఫాన్‌ఖాన్, బీఏఖాజా, కరీముల్లా, మేస్త్రీ శ్రీనివాసులు, శివయ్య, వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ ప్రమీల, డీఈ శిరీష, ఏఈ స్నేహప్రియ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రైతు ఆత్మహత్య


జగదీశ్వర్ బాబు (ఫైల్)

చిట్వేలి : మండలంలోని కె.కందులవారిపల్లిలో ఓ యువరైతు ఆత్మహత్య చేసుకున్నాడు. కె.కందుల వారిపల్లికి చెందిన కందుల జగదీశ్వర్‌బాబు (36) తనకు ఉన్న రెండున్నర ఎకరాలతోపాటు మరో 10 ఎకరాలు కౌలుకు తీసుకొని వ్యవసాయం చేశాడు. ఆదాయం రాక పోగా అప్పులు పెరిగిపోయాయి. వడ్డీలు కూడా పేరుకుపోతుండటంతో గురువారం రాత్రి విషపు గుళికలు తీసుకోవడంతో బంధువులు హుటాహుటిన నెల్లూరు ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం మరణించినట్లు బంధువులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

చోరీ కేసులో నిందితుడి అరెస్ట్

పెద్దతిప్పసముద్రం : మండలంలోని కందుకూరులో ఇటీవల ఇద్దరు వ్యక్తులకు చెందిన ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ మధురామచంద్రుడు సిబ్బందితో విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇదే మండలంలోని కమ్మచెరువుకు చెందిన డేరంగుల శివశంకర్ (35) వాహనాల చోరీకి పాల్పడినట్లు విచారణలో వెల్లడైంది. శుక్రవారం నిందితుడిని అరెస్టు చేసి అతడి వద్ద లభించిన ఓ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

పిడుగుపాటుకు ఆవులు మృతి


మృతి చెందిన పాడి ఆవులు

మదనపల్లె : మదనపల్లె మండలంలోని బొమ్మన చెరువు పంచాయతీ టేకులపాళ్యంలో పిడుగుపాటుకు రెండు పాడి ఆవులు శుక్రవారం మృతి చెందాయి. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములతో కూడిన వర్షం పడింది. సమీపంలో పిడుగు పడటంతో ఆ శబ్దానికి స్థానికుడైన పగడాల సురేష్‌కు చెందిన రెండు పాడి ఆవులు మృతి చెందాయి. దాదాపు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని బాధిత తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన కోరారు.

టెండర్లు ఆహ్వానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప డిపోలో ఖాళీగా ఉన్న స్టాల్స్/షాపులకు టెండర్లను ఆహ్వానిస్తున్నామని కడప డిపో మేనేజర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వ్యాపారులు/వ్యాపార సంస్థలు కడప డిపో కార్యాలయం నుంచి టెండరు దరఖాస్తులు పొంది సీల్డ్ కవర్లను డిస్ట్రిక్ట్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు ఆఫీసర్ వారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన టెండరు బాక్సులో మాత్రమే వేయాలని పేర్కొన్నారు.

ప్రభుత్వ సాయం.. వారికి వరం

- ప్రత్యేకంగా జగనన్న కాలనీలో ఇంటి నిర్మాణాలు
- ఆర్థిక స్వావలంబనకు స్వయం ఉపాధి శిక్షణలు
- స్వయం సహాయక సంఘాల ఏర్పాటుకు చర్యలు
- చులకన భావన, అవహేళనల నుంచి ఆత్మగౌరవం వైపు 'ట్రాన్స్‌జెండర్స్' అడుగులు

సమాజంలో అందరూ మనుషులే... అంతా సమానులే! అందులో 'ట్రాన్స్‌జెండర్స్' (హిజ్రాలు) కూడా ఒక భాగమే. వారు కూడా అందరిలాగా ప్రాణమున్న మనుషులే. అయితే వారి పట్ల సమాజంలో చులకన భావన ఉంది. ఈ నేపథ్యంలో 'థర్డ్ జెండర్'గా పిలువబడే వారి సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. దీంతో మొదటిసారిగా వారి సం'క్షేమం' నవ సమాజంలోకి అడుగులు వేస్తోంది. దీంతో ఆ వర్గాల్లో సంతోషం వెల్లివిరుస్తోంది. ప్రభుత్వం ఇస్తున్న తోడ్పాటుతో గౌరవంగా జీవిస్తున్నామమ్మా అంటూ వారు సంతోష పడుతున్నారు.

జిల్లాల వారీగా ట్రాన్స్‌జెండర్స్ వివరాలు

	వైఎస్సార్	అన్నమయ్య
గుర్తింపు పొందిన వారు	113	100
పింఛన్లు పొందుతున్న వారు	123	93
జగనన్న కాలనీల్లో గృహాలు		
పొందిన వారు	47	40
ఉపాధి శిక్షణ పొందిన వారు	34	16


ప్రభుత్వ పథకాలతో లబ్ధి పొందుతున్న ట్రాన్స్‌జెండర్స్

కడప రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లింగబేధం లేకుండా అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్నారు. రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ట్రాన్స్‌జెండర్స్ సమాజంలో తలెత్తుకుని గౌరవంగా అందరికీ సమానంగా జీవించడానికి ప్రత్యేకమైన చర్యలు చేపట్టారు. ప్రభుత్వం చొరవతో ట్రాన్స్‌జెండర్స్ ఆత్మగౌరవం వైపుగా ముందడుగు వేస్తున్నారు.

స్వశక్తితో ఎదగడానికి

'చేపలను ఉచితంగా ఇవ్వడం కంటే.. పట్టడం నేర్పించడం ఉత్తమం' అనేది చైనా దేశస్తుల అభిప్రాయం. కాగా ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్స్ ఒకరిపైన ఆధారపడకుండా స్వశక్తితో ఎదగడానికి తోడ్పాటు ఇచ్చింది. ఆ మేరకు సిండికేట్ బ్యాంకు ఆధ్వర్యంలో డ్రైవింగ్, బ్యూటిషియన్ తదితర ఆసక్తి గల రంగాల్లో ఉచిత శిక్షణను ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణ వారి జీవన విధానంలో సరికొత్త మార్పులను తీసుకు రావడానికి దోహదపడింది. ఈ శిక్షణ ద్వారా కొంత మంది ఉపాధి అవకాశాలను పొందుతున్నారు. స్వశక్తితో జీవిస్తూ పలువురు ట్రాన్స్‌జెండర్స్‌కు ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఎస్‌హెచ్‌జీల ఏర్పాటు దిశగా..

మహిళా స్వయం సహాయక సంఘాలు ఎంతటి అభివృద్ధి పథంలో నడుస్తున్నాయో ప్రతి ఒక్కరం ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఈ సంఘాల ద్వారా మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా అడుగులు వేస్తున్నారు. ఇంటిని పోషించుకోగలుగుతున్నారు. ఇది గమనించిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపడుతోంది. ప్రత్యేకంగా ట్రాన్స్‌జెండర్స్‌తో స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేసి తద్వారా వారిని అభివృద్ధి పథంలోకి తీసుకు వెళ్లడానికి చర్యలు చేపడుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 17 సంఘాలు ఉండగా, అందులో కడప నగరంలో ఒక గ్రూపు ఏర్పాటైంది.

అర్హులు ఉంటే పింఛన్ మంజూరు

గత తెలుగుదేశం పార్టీ హయాంలో హిజ్రాలకు ఇచ్చే పింఛన్లు నామమాత్రంగానే ఉండేవి. కొత్త పింఛన్ల మంజూరు అసలు ఉండేది కాదు. ఆ ప్రభుత్వంలో ఒకరికి నెలకు రూ.1500, కొద్ది నెలలు రూ.2000 మంజూరు చేశారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ పింఛన్ మొత్తాన్ని రూ.2500 నుంచి రూ. 3000లకు పెంచారు. అలాగే అర్హులు ఎంత మంది ఉన్నా ఏడాదిలో రెండుసార్లు కొత్త పింఛన్లు మంజూరు చేసేలా చర్యలు చేపట్టారు. దీంతో నిరుపేదలైన ట్రాన్స్‌జెండర్స్‌కు ఆర్థిక తోడ్పాటు లభించినట్లయింది.

అభివృద్ధే ధ్యేయంగా..

చాలా మందిలో ట్రాన్స్‌జెండర్స్ పట్ల ఒక విధమైన చులకన, తక్కువ భావన ఉంటుంది. ట్రాన్స్‌జెండర్స్‌లో ఎంతో మంది ఉన్నతమైన వారు, విద్యావంతులు, సమాజానికి మేలు చేయాలన్న సంకల్పం కలిగినవారు ఉన్నారు. అయితే వారిలోని దయాగుణాన్ని చాలామంది గమనించడం లేదనే అభిప్రాయం ఉంది. చాలా ప్రాంతాలలో ట్రాన్స్‌జెండర్స్ దీవించినా, వారు శుభ కార్యాల్లో పాల్గొంటే అంతా మంచి జరుగుతుందనే అభిప్రాయం చాలామందిలో ఉంది. ఈ అంశాలను చాలా మంది ఆచరిస్తుంటారు కూడా. కొద్దిమందిలో మాత్రమే వారిపట్ల తక్కువ భావన ఉంది. ఈ నేపథ్యంలో ట్రాన్స్‌జెండర్స్‌లో అవగాహన కల్పించడంతోపాటు ఇతరుల్లో వారి పట్ల చులకన భావనను తొలగించడానికి ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోంది. అందులో భాగంగా వారి సం'క్షేమం' కోసం ప్రత్యేకంగా చర్యలు చేపట్టడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

గూడు కోసం..

ప్రతి ఒక్కరూ సొంతింటి కలను సాకారం చేసుకోవడానికి శాయశక్తులా కృషి చేస్తుంటారు. ఇది గమనించిన ప్రభుత్వం జగనన్న కాలనీల ద్వారా పెద్ద ఎత్తున పేదలకు ఇంటి నిర్మాణం చేపట్టింది. అందులో భాగంగా ట్రాన్స్‌జెండర్స్‌కు కూడా అవకాశం కల్పించారు. కాగా లే అవుట్లలో అన్ని వర్గాలకు చెందిన వారు నివాసాలు ఏర్పాటు చేసుకుంటారు. అయితే కొంత మంది ట్రాన్స్‌జెండర్స్ కేటాయించిన లే అవుట్లలోనే తమకు ప్రత్యేకంగా అవకాశం కల్పించాలని కోరారు. వారి కోరిక మేరకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. వైఎస్సార్ జిల్లాలో మొత్తం 47 మందికి ఇంటి స్థలాలు కేటాయించగా, అందులో కడప నగరంలోని లే అవుట్‌లో 17 మందికి ఒకే చోట ఇంటి నిర్మాణం చేపట్టేలా అవకాశం కల్పించారు. ఇలా రాష్ట్రంలో పలు చోట్ల వారి అభ్యర్థన మేరకు వెసలుబాటును కల్పించడం జరిగింది. ఈ నేపథ్యంలో సొంతింటి కల సాకారం అయినందుకు ట్రాన్స్‌జెండర్స్‌లో సంతోషం నెలకొంది.



ప్రభుత్వ చర్యలు అభినందనీయం



ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలు అభినందనీయం. మాకు ఇంటి స్థలాలు మంజూరు చేశారు. ఉపాధి శిక్షణలను ఇచ్చారు. పెన్షన్లు వస్తున్నాయి. అయితే మా సంక్షేమానికి మరింతగా చర్యలు చేపట్టాలి. ప్రత్యేకంగా బడ్జెట్‌ను కేటాయించాలి.

– అనన్య, తిలక్‌నగర్, కడప

అభివృద్ధికి ప్రత్యేక ప్రతిపాదనలు



ట్రాన్స్‌జెండర్స్‌కు ఆర్థిక, ఉపాధి రంగాల్లో పునరావాసం కల్పించడానికి ప్రత్యేకంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. వారికి రుణాలను మంజూరు చేయడానికి, స్వయం సహాయక సంఘాల్లో చేర్పించి బ్యాంకుల ద్వారా ప్రత్యేకంగా రుణాలు ఇప్పించడానికి ప్రతిపాదనలు పంపాము. ప్రభుత్వం ట్రాన్స్‌జెండర్స్ సంక్షేమానికి ప్రత్యేకంగా చర్యలు చేపడుతోంది. ప్రభుత్వ ఆస్పత్రుల ద్వారా ధ్రువీకరణ పత్రాలు పొందిన వారిని ట్రాన్స్‌జెండర్స్‌గా పరిగణించడం జరుగుతోంది.

– క్రిష్ణ కిశోర్, అసిస్టెంట్ డైరెక్టర్, జిల్లా దివ్యాంగులు, హిజ్రాల సంక్షేమశాఖ

మామిడి రైతుల ఆదాయం పెంచడమే లక్ష్యం


మాట్లాడుతున్న ఉద్యాన అధికారి రవిచంద్రబాబు

రాయచోటి టౌన్ : మామిడి రైతుల ఆదాయం పెంచడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నమయ్య జిల్లా ఉద్యానశాఖ రవిచంద్రబాబు తెలిపారు. శుక్రవారం జిల్లా కేంద్రం రాయచోటిలోని ఉద్యానశాఖ కార్యాలయంలో గ్లోబల్ ఫాం ఫ్రెష్ ప్రైవేట్ లిమిటెడ్ వారితో కలిసి జిల్లా స్థాయి హెచ్‌వోలు, జిల్లా స్థాయిలోని మామిడి రైతులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు మార్కెటింగ్ అవకాశాలు విస్తృత పరచడం, కొనుగోలుదారులు, అమ్మకందారుల మధ్య అంతరాన్ని తగ్గించి రైతులకు లాభాలు వచ్చే విధంగా అవకాశాల్ని కల్పిస్తున్నామన్నారు. పంట కోత సమయంలో నాణ్యత ప్రమాణాల ఆధారంగా కాయలు కోయడం, సరైన పద్ధతిలో కొనుగోలుదారులకు చేర్చడం జరుగుతుందన్నారు. అనంతరం ఎగుమతి దారుడు ప్రవీణ్‌కుమార్ మామిడి పంటను ఎగుమతి చేయడంలో పాటించాల్సిన నాణ్యత ప్రమాణాలపై వివరించి చెప్పారు. కార్యక్రమంలో గ్లోబల్‌ఫాం ఫ్రెష్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ వి.ఉమాపతిరెడ్డి, ఈడీ చంద్రమోహన్, ఉద్యాన అధికారులు ఎస్. వనితాబాయ్, నాగమణి, జి.సురేష్‌బాబు, ఎఫ్‌పీవోలు, కొనుగోలుదారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

వేంపల్లె : అలవలపాడు గ్రామానికి చెందిన శిరిగిరెడ్డి సిసీంద్రిరెడ్డి(23) గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శుక్రవారం వేంపల్లె ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి పోలీసులు కేసు నమోదు చేశారు. అలవలపాడు గ్రామానికి చెందిన రేణుక, పుల్లారెడ్డి దంపతులకు శ్రీకాంత్‌రెడ్డి, సిసీంద్రీ రెడ్డి అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండవ కుమారుడు సిసీంద్రీరెడ్డి చిత్తూరు జిల్లాలోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఎంసీఏ చదువుతున్నాడు. గురువారం మధ్యాహ్నం సొంత పని నిమిత్తం వేంపల్లెకు వచ్చి రాత్రికి స్వగ్రామానికి తిరిగి వెళుతుండగా అయ్యవారిపల్లె సమీపంలో రోడ్డు మలుపు కనిపించకపోవడంతో అతివేగంగా బైకులో వస్తున్న సిసీంద్రీరెడ్డి ఎదురుగా ఉన్న విద్యుత్ స్థంభాన్ని ఢీకొట్టాడు. తలకు పెద్ద గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

పోలీస్‌స్టేషన్లు తనిఖీ చేసిన ఎస్పీ


రామాపురం స్టేషన్‌లో పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ గంగాధర్ రావు

సంబేపల్లె/రామాపురం : జిల్లాలోని రామాపురం, సంబేపల్లె పోలీస్‌స్టేషన్‌లను జిల్లా ఎస్పీ గంగాధర్ రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సంబేపల్లె స్టేషన్‌లోని పలు రికార్డులను ఆయన పరిశీలించారు. మండల పరిధిలో అమలవుతున్న లా అండ్ ఆర్డర్, కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక శక్తుల పట్ల కఠిన వైఖరి ప్రదర్శించాలని పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రూరల్ సీఐ లింగప్ప, ఎస్‌ఐ షరీఫ్ ఉన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

రామాపురంలో ఎస్పీ విలేకర్లతో సమావేశంలో మాట్లాడారు. కర్నూలు – చిత్తూరు 40వ జాతీయ రహదారి మార్గంలోని రామాపురం మండల పరిధిలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపడం జరిగిందని తెలిపారు. జిల్లాలో 63 ప్రాంతాలను ప్రమాద స్థలాలుగా గుర్తించి జాతీయ రహదారి నియమాల ప్రకారం ప్రమాదాల నివారణకు సూచిక బోర్డులు, డివైడర్లను ఏర్పాటు చేయడం జరుగుతోందన్నారు. సిగ్నల్ లైట్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాద్, మండల ఎస్‌ఐ కొండారెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో చెలరేగిన మంటలు


మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

లక్కిరెడ్డిపల్లి : మండలంలోని లక్కిరెడ్డిపల్లి పోలీస్‌స్టేషన్ వెనుకభాగాన ఉన్న విద్యుత్ ట్రాన్సుఫార్మర్ వద్ద షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించింది. శుక్రవారం ఈదురు గాలుల ధాటికి ట్రాన్సుఫార్మర్ వద్ద ఉన్న విద్యుత్ తీగలు తెగిపడటంతో మంటలు చెలరేగాయి. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఎండుగడ్డి, ఎండిన చెట్లు అధికంగా ఉండటంతో మంటలు ఎక్కువయ్యాయి. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపుచేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది.

ఉత్తమ రైతులకు సత్కారం


ఉత్తమ రైతులను సత్కరిస్తున్న కమాండెంటు శ్రీనివాసరావు

సిద్దవటం : మండలంలోని భాకరాపేట గ్రామ సమీపంలో ఉన్న ఏపీఎస్పీ 11వ బెటాలియన్‌లో శుక్రవారం ఉత్తమ రైతులకు ఘన సత్కారం చేశారు. ఈ సందర్భంగా కమాండెంటు శ్రీనివాసరావు మాట్లాడుతూ మేముసైతం, కిసాన్ గ్రామిక సత్ సంఘ్ స్వచ్ఛంద సంస్థ మద్దతుతో ఏకలవ్య ఫౌండేషన్ జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన 12 మంది ఉత్తమ రైతులను సన్మానించినట్లు తెలిపారు. రైతులు ఎ.హరి, వి.రాజ, పి.క్రిష్ణయ్య, బి.గంగిశెట్టి, సి.చంద్రశేఖర్‌రెడ్డి, వీరప్రతాప్‌రెడ్డి, లక్షుమయ్య, సుబ్బారెడ్డి, శివశంకర్, జి.జయరామయ్య, వెంకటసుబ్బయ్య, ఆర్. వెంకటసుబ్బమ్మలను జ్ఞాపికతో సత్కరించారు. అలాగే వారి కష్టాన్ని అధికారులు ప్రశంసించారు. అసిస్టెంటు కమాండెంట్లు, సి.ఎన్.డి. ప్రసాద్, కె. వెంకట్‌రెడ్డి, వి.జయప్రసాద్, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, ఏఆర్‌ఎస్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్య


పామును పట్టుకుంటున్న మహేష్ (ఫైల్)

మదనపల్లె : కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా మనస్తాపం చెంది హెల్పింగ్ మైండ్స్ సభ్యుడైన స్నేక్ సేవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం రాత్రి మదనపల్లెలో జరిగింది. మదనపల్లె మండలం కొత్తపల్లె పంచాయతీ ఈశ్వరమ్మకాలనీకి చెందిన మహేష్ (24) ఫొటో గ్రాఫర్‌గా పని చేస్తూ, హెల్పింగ్ మైండ్స్ సంస్థలో స్నేక్ సేవర్‌గా ఉంటున్నారు. ఇతని తల్లిదండ్రులు రెడ్డికృష్ణ, రుక్మిణి అనారోగ్యంతో గతంలో మృతి చెందారు. అప్పటి నుంచి మేనత్త సరస్వతి వద్ద పెరిగాడు. తల్లిదండ్రులు తనతో లేరన్న బాధ వేధిస్తున్నా మేనత్త సరస్వతి సాయంతో పెరిగి పెద్దవాడయ్యాడు. అయితే కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందుల కారణంగా తీవ్ర మనస్తాపం చెంది గురువారం రాత్రి పురుగుల నివారణ మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. దీంతో శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మహేష్ మృతి చెందడంతో హెల్పింగ్ మైండ్స్ సంస్థ సభ్యులు, కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. సంస్థ సభ్యుడుగా ఎన్నో పాముల ప్రాణాలను కాపాడి వాటిని తీసుకెళ్లి అటవీప్రాంతంలో వదిలిన మహేష్ మృతి చెందడం బాధిస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

వైభవోపేతంగా అష్టోత్తర కలశాభి షేకం

వల్లూరు : పుష్పగిరి శ్రీ కామాక్షీ వైద్యనాథేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం శ్రీ లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో అష్టోత్తర కలశాభిషేకాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి విశ్వక్సేన పూజ, పంచామృతాభిషేకం కార్యక్రమాలు చేశారు. అగ్ని ప్రణయనం చేసి పారమాత్మక హోమాన్ని నిర్వహించారు. వివిధ రకాల పరిహారాల కోసం బింబశుద్ధితో 108 కళశాలను ఏర్పాటు చేసి గోదావరి పుష్కర, తుంగభద్ర, కృష్ణ, కావేరీ, ప్రయాగ, త్రివేణీ సంగమ, కాశీ గంగ, రామేశ్వర తీర్థం, పెన్నా నదులలోని పుణ్య జలాలలు, విశేష ద్రవ్యాలు, ఆవు పాలు, నెయ్యి, తేనె, సర్వ పోదకం, అక్ష తోదకం, కుషోదకం, రత్నోదకం, మృన్వయ జలం, కషాయం, పుష్పోదకం, హరిద్రోదకం, గంధోధకంలతో నింపి 108 మంది దేవతలను ఆవాహన చేశారు. అనంతరం కళశాలలోని ద్రవ్యాలతో శ్రీ చెన్నకేశవ స్వామి మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించారు. నిత్య, ఉక్త హోమాలను నిర్వహించారు. రాత్రి శ్రీ చెన్నకేశవస్వామి పెద్ద శేష వాహనంపై కొలువు దీరగా మంగళ వాయిద్యాల నడుమ దివిటీల వెలుగులో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీ వైద్యనాథేశ్వరస్వామి ఆలయంలో ఆలయ అర్చకులు శ్రీనివాస మూర్తి ఆధ్వర్యంలో స్వామివారికి రుద్రాభిషేకం, శ్రీ చక్ర సహిత కామాక్షీ దేవి అమ్మవారికి కుంకుమార్చనలను నిర్వహించారు. రాత్రి శ్రీకామాక్షీ వైద్యనాథేశ్వర స్వామికి గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలి


మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి

రాయచోటి : జిల్లాలో చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్లో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని సంబంధిత శాఖల అధికారులతో కలిసి వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి అధ్యక్షతన ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సత్యనారాయణ నిర్వహించారు. రైతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలన్నీ వివిధ శాఖలు ద్వారా త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ సలహా మండలి ఛైర్మన్ అన్నారు. అలాగే చిరుధాన్యాల సాగును ప్రోత్సహించాలన్నారు. చిరుధ్యాన్యాల ఆవశ్యకతను, ఉపయోగాల గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు. మండలస్థాయిలో సలహా మండలి సమావేశంలో సభ్యులు తీసుకొచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. రైతుల సంక్షేమానికి అధికారులు కృషి చేయాలని ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ సత్యనారాయణ అన్నారు. గ్రామానికి ఒకటి చొప్పున మంజూరైన కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లను (యంత్ర సేవా కేంద్రాలు) ఈనెల 25వ తేదీ లోగా పూర్తి చేయాలని, వ్యవసాయ శాఖ, సహాయ వ్యవసాయ సంచాలకులను ఆదేశించారు. ఎర్రచందనం మొక్కలు అటవీశాఖ ద్వారా నర్సరీల్లో పెంచి రైతులకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు జిల్లా అటవీశాఖ అధికారి వివేక్ అన్నారు. వన్య ప్రాణాల వల్ల పంటలు దెబ్బతిన్నట్లయితే ఆ విషయాన్ని అటవీ అధికారులకు తెలిపితే వాటికి తగిన పరిహారం చెల్లిస్తారని తెలిపారు. గ్రామాల్లో రైతులు ప్రస్తుతం ఎర్రచందనం, శ్రీగంధం మొక్కలు సాగుచేస్తున్నారన్నారు. వీటికి ఏదైనా అనుమతులు తీసుకోవాలా అని సభ్యులు కోరగా సాగు చేసుకోవడానికి ఎలాంటి అనుమతి అవసరం లేదన్నారు. కానీ కోత దశలో వాటిని పరిశీలించి రెవెన్యూ రికార్డు ప్రకారం అనుమతులు మంజూరు చేయన్నుట్లు చెప్పారు. రైతు భరోసా పొందని రైతులు ఈనెల 31వ తేదీలోగా ఆర్‌బీకేలో నమోదు చేసుకుంటే వారికి లబ్ధి చేకూర్చగలమని జిల్లా వ్యవసాయ అధికారి ఉమా మహేశ్వరమ్మ అన్నారు. ఖరీఫ్ సీజన్‌కు పచ్చిరొట్ట విత్తనాలు, వేరుశనగ, చిరుధాన్యాలను సబ్సిడీపై రైతు భరోసా కేంద్రాల్లో అందించే విధంగా 48,867 క్వింటాళ్ల విత్తనాల పంపిణీకి ప్రణాళికలు చేశామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి కమిటీ సభ్యులు దిన్నెపాడు రవిరాజు, బోదషావలి, వివిధ శాఖల జిల్లా అధికారులు, వ్యవసాయ సహాయ సంచాలకులు తదితరులు పాల్గొన్నారు.